సాక్షి నిర్మల్

సోమవారం । 2 । జూన్ । 2025



ప్రకృతి సోయగం 8లో ▸

ప్రకృతిలో ఎన్నో అందాలు దాగి ఉన్నాయి. ఇటీవలి వర్షాలకు పచ్చదనం పరుచుకున్న ఉమ్మడి జిల్లా అడవుల్లో వన్యప్రాణులు ప్రకృతి ప్రేమికులను కనువిందు చేస్తున్నాయి.



'మద్దతు' పెరిగి రైతు మురిసె

కేంద్ర ప్రభుత్వం ఇటీవల 14 రకాల పంటలకు కనీస మద్దతు ధర పెంచిన విషయం తెలిసిందే. జిల్లాలో 1.94లక్షల మంది రైతులు ప్రయోజనం పొందనున్నారు. 9లో ▸

గరిష్టం/కనిష్టం 34.0 /27.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడా చిన్నపాటి వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

భక్తులతో కిటకిటలాడిన 'అడెల్లి'



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. నిర్మల్‌తోపాటు ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌తోపాటు మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ భోజాగౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

గజ్జలమ్మకు పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: మండల కేంద్రంలోని గజ్జలమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్లకు గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ అభిషేకం, అలంకరణ, అర్చన, హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గజ్జలమ్మ పల్లకీసేవ నిర్వహించగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవార్లకు బోనాలను నైవేద్యంగా సమర్పించారు. చిన్నపిల్లలతో తులాభారం (బంగారం)తో, తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

నేటి ప్రజావాణి రద్దు

నిర్మల్‌చైన్‌గేట్: నేడు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్న సందర్భంగా ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలంతా ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. వచ్చే సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

5న వాహన విడిభాగాల వేలం

నిర్మల్‌టౌన్: జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్‌లోని మోటార్ వాహనాల కార్యాలయంలో ఈనెల 5న ఉదయం 10గంటలకు వాహనాల విడిభాగాలను వేలం వేయనున్నట్లు ఎస్పీ జానకీ షర్మిల ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విడిభాగాలు, టైర్లు, బ్యాటరీలు, వాడిన ఇంజన్ ఆయిల్‌కు వేలం ఉంటుందని పేర్కొన్నారు. పాల్గొనేవారు వేలం ముగిసిన వెంటనే డబ్బులు చెల్లించి, విడి భాగాలు తీసుకువెళ్లాలని, పూర్తి వివరాలకు 8712659575 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

నిర్మల్ రూరల్: పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. జిల్లాలో మొత్తం 302 మంది విద్యార్థులు పరీక్షల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరికి జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేట్ బాలికల జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా పరీక్షల అధికారి ముడారపు పరమేశ్వర్ తెలిపారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ఘనంగా బోనాల పండుగ



ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

భైంసారూరల్: మండలంలోని వాలేగాం గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. గ్రామస్తులు నెత్తిన గంగ నీళ్ల, బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య పోచమ్మ ఆలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు.



జిల్లా కేంద్రంలో పేరుకే ఉన్నట్టు మారిన పీజీ కాలేజీ భవనం

ఉన్నత చదువులెలా?

- జిల్లాకు రాని ఇంజినీరింగ్ కళాశాల
- పీజీ కళాశాల చిరునామా ఎక్కడో!
- దిక్కు లేకుండా పోయిన డైట్ కాలేజీ
- తాజాగా 'బాలికల డిగ్రీ'కి ఎసరు!
- పట్టించుకోని పాలకులు, అధికారులు

జాడలేని పీజీ కళాశాల

నిర్మల్‌లో కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏకైక పీజీ కళాశాల జాడ కనిపించడం లేదు. తరగతులు, విద్యార్థులు, అధ్యాపకులు ఎవరూ కనిపించకపోవడం విడ్డూరంగా ఉంది. అడిగితే 'అంతా ఆన్‌లైన్‌లోనే' అనే సమాధానాలు వస్తున్నాయి. ఈ నిర్లక్ష్యంతో పీజీ కళాశాల భవనాన్ని నర్సింగ్ కళాశాలకు కేటాయించారు. గతంలో పీజీ హాస్టల్‌గా ఉన్న గదుల్లో ఇప్పుడు భరోసా కేంద్రం నిర్వహిస్తున్నారు. పాలకులు, యూనివర్సిటీ అధికారుల తీరు చూస్తే, ఈ పీజీ కేంద్రం పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం కనిపిస్తోంది.

నిర్మల్: జిల్లాను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దుతామని గత పాలకులు ఇచ్చిన హామీలు నీటిమీద రాతలుగా మిగిలాయి. కేజీ నుంచి పీజీ వరకు అన్ని కోర్సులు అందుబాటులోకి తెస్తామన్న హామీలు నెరవేరకపోగా, ఉన్న విద్యాసంస్థలనూ తరలించడంతో జిల్లా విద్యార్థులు ఉన్నతవిద్యకు దూరమవుతున్నారు. జిల్లాలోని పీజీ, డైట్ కళాశాలలు దిక్కులేకుండా పోయాయి. తాజాగా, సాంఘిక సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాలనూ జిల్లా నుంచి తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'ఇంజినీరింగ్' కలే..

జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాల లేక విద్యార్థులు హైదరాబాద్ లాంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. 'మా పిల్లలు ఇంజినీరింగ్ చదవొద్దా?' అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా వాసులకు వైద్య విద్య అందుబాటులోకి వచ్చింది. కానీ, ఇంజినీరింగ్‌లాంటి సాంకేతిక విద్యాసౌకర్యాలు ఏమాత్రం అభివృద్ధి చెందలేదు. బాసరలోని ఆర్జీయూకేటీ(ట్రిపుల్‌ఐటీ) ఉన్నా జిల్లా విద్యార్థులకు అవకాశాలు నామమాత్రంగానే ఉన్నాయి. గతంలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరినప్పుడు, అప్పటి సీఎం కేసీఆర్ దానిని ఆదిలాబాద్‌కు కేటాయించి, నిర్మల్‌వాసులను నిరాశకు గురిచేశారు. అప్పటినుంచి సాంకేతిక విద్యపై ఎవరూ దృష్టి సారించలేదు.

సాంఘిక సంక్షేమ కళాశాలకు ముప్పు!

జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కళాశాలను ఆదిలాబాద్‌కు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీ, ఎంఎస్‌సీఎస్, బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ), బీకామ్ (కంప్యూటర్స్, జనరల్), బీఏ లాంటి కోర్సులతో 840 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం 350 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఎస్సీ విద్యార్థినులకు 75% రిజర్వేషన్, ఇతర వర్గాలకు సీట్లు కేటాయిస్తున్నారు. వసతి సౌకర్యం ఉండటంతో షెడ్యూల్డ్ కులాలకు చెందిన కుటుంబాలు తమ పిల్లలను ఇక్కడ చదివిస్తున్నాయి. ఈ కళాశాలనూ ఆదిలాబాద్‌లోని కళాశాలలో విలీనం చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో ఆదిలాబాద్ కళాశాలను నిర్మల్‌కు తరలించే ప్రతిపాదనను స్థానిక పాలకులు అడ్డుకోగా, నిర్మల్‌లో పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ఈ కళాశాల ఆదిలాబాద్‌కు తరలిపోయే ప్రమాదం ఉంది. చదువుల తల్లి కొలువైన నిర్మల్ జిల్లాలో విద్యాసంస్థలు క్షీణిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. పీజీ కళాశాల, డైట్ కళాశాలలు ఇప్పటికే కనుమరుగైన నేపథ్యంలో సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల కూడా జిల్లాను వీడితే, విద్యార్థులు ఉన్నత చదువులకు పొరుగు జిల్లాలకు వెళ్లాల్సిందే. పాలకులు, అధికారులు తక్షణమే దృష్టి సారించి, జిల్లా విద్యా వ్యవస్థను కాపాడాల్సిన అవసరం ఉంది.

మినీ క్యాంపస్ ఏర్పాటు చేయాలి



జిల్లాలో ఉన్నతవిద్య కోసం ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. నిర్మల్‌లో ఉన్న పీజీ కాలేజీలో సైన్స్ కోర్సులు అందుబాటులోకి తీసుకురావాలి. బాసర సరస్వతీమాత పేరిట మినీ క్యాంపస్‌గా తీర్చిదిద్దాలి. జిల్లా నుంచి ఏ విద్యాసంస్థనూ తరలించొద్దు.

– వినోద్‌కుమార్, ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి



నిర్మల్ కేంద్రంగా జ్ఞానసరస్వతీ యూనివర్సిటీ ఏర్పాటు ప్రతిపాదనను అమలు చేయాలి. ఇంజినీరింగ్‌తోపాటు డిగ్రీ, పీజీల్లో వృత్తివిద్య, ఉపాధి కల్పన కోర్సులు అందుబాటులోకి తీసుకురావాలి. ఇక్కడ ఉన్న విద్యాలయాలు తరలిపోకుండా పాలకులు చొరవ తీసుకోవాలి.

– నంగి శ్రీనివాస్, జ్ఞానసరస్వతీ వర్సిటీ సాధన సమితి

ఉపాధ్యాయుల్లో 'సర్దుబాటు' రగడ



- పాఠశాలల వారీగా వివరాల సేకరణ
- 13లోపు ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు
- వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

నిర్మల్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. ఇందుకోసం ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని నిర్ణయించింది. అయితే ఈ ప్రక్రియ ఈనెల 13లోపు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులపై ఉపాధ్యాయ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. జిల్లా విద్యాశాఖ అధికారులు జిల్లాలో ప్రస్తుతం ఒక్కో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య.. ఎంత మంది ఉపాధ్యాయులున్నారు.. ఇంకా ఎంతమంది అవసరం ఉంది.. తదితర వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

ఇవీ నిబంధనలు

ఈనెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో భాగంగా తాజాగా ప్రభుత్వం నిబంధనలు జారీ చేసింది. మొదటి ప్రాధాన్యం పంచాయతీ పరిధి, తర్వాత స్కూల్ కాంప్లెక్స్, ఆ తర్వాత మండలం, అనంతరం జిల్లా పరిధిలో సర్దుబాటు చేసుకోవచ్చు. వీటితోపాటు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా సర్దుబాటు చేయాలని నిబంధనలున్నాయి. పరస్పర బదిలీలకు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వరాదు. ఒకే ప్రాంగణంలో రెండు ప్రాథమిక పాఠశాలలు లేదా ఒక ఉన్నత, ప్రాథమిక పాఠశాల, ఒక ప్రాథమిక పాఠశాల ఒకే ప్రాంగణంలో ఉంటే వాటిని ఒక యూనిట్‌గా పరిగణించవచ్చు. అవసరాన్ని బట్టి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి. ఇంకా మిగులు ఉంటే ఇతర అవసరమైన స్కూళ్లకు పంపించాలి. ఈ ప్రక్రియ కోసం గత యూడైస్ వివరాలను ప్రాతిపదికగా తీసుకోనున్నారు. 10 మందిలోపు విద్యార్థులున్న పాఠశాలకు ఒకరు, 60లోపు ఉన్న పాఠశాలకు ఇద్దరు, 90 లోపు ఉన్న పాఠశాలకు ముగ్గురు, 200లోపు విద్యార్థులుంటే ఆరుగురు ఉపాధ్యాయులు ఉండాలని, 200 దాటిన తర్వాత ప్రతీ నలభై మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

సర్దుబాటు ప్రక్రియను ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ నెల 6వ తేదీ నుంచి బడిబాట కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది. కాగా, బడిబాట ముగిసిన తర్వాత విద్యార్థుల సంఖ్యపై స్పష్టత వచ్చే అవకాశం ఉంటుందని, ఆ తర్వాత సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని ఉపాధ్యాయ వర్గాలు కోరుతున్నాయి. విద్యాశాఖ ముందస్తు సర్దుబాటు నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తంజేస్తున్నాయి. విద్యాశాఖ ఉత్తర్వుల ప్రకారం 60మంది విద్యార్థులుంటే ఇద్దరు ఉపాధ్యాయులు సరిపోతారని ఉండగా ఇది ఆచరణలో అసాధ్యమని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మొత్తం 18 సబ్జెక్టులుంటే ఇద్దరే ఉపాధ్యాయులు ఎలా బోధిస్తారని ప్రశ్నిస్తున్నారు. బోధనతోపాటు అనేక రకాల రిపోర్టులు, నివేదికలు సిద్ధం చేయాల్సి ఉంటుందని, వాటికే ఒకరు సరిపోతున్నారని వాపోతున్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా తరగతికి ఒక ఉపాధ్యాయుడి చొప్పున కేటాయించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

బడిబాట తర్వాతే చేపట్టాలి



బడిబాట కార్యక్రమం ముగిసిన తర్వాత ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి. దీంతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందా... అదే విధంగా ఉంటుందా.. అనేది తెలుస్తుంది. దీన్ని ఆధారంగా చేసుకుని సర్దుబాటు ప్రక్రియ చేపడితే బాగుంటుంది.

– భూమన్నయాదవ్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

ఉత్తర్వులు విరమించుకోవాలి



సర్దుబాటు ఉత్తర్వులను వెంటనే విరమించుకోవాలి. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామంటూనే మరోవైపు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య కుదించాలని చూడడం సరికాదు. ఈ నిర్ణయం పాఠశాలలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముంది.

– చంద్ర నాగకాంత్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే



ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో సర్దుబాటు ప్రక్రియ చేపడతాం. నిబంధనల ప్రకారం అవసరమున్న చోటకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తాం. అయితే ఇందుకు సంబంధించి ఉన్నతాధికారులతో సమావేశం జరగాల్సి ఉంది.

– రామారావు, జిల్లా విద్యాధికారి

అ'పూర్వ'ం.. ఆత్మీయ సమ్మేళనం



కడెం: కొండుకూరులో కలుసుకున్న1992-93 పదో తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు

కడెం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–93 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివినవారంతా ఆదివారం మండలంలోని కొండుకూర్‌లోగల ఫంక్షన్‌హాల్‌లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం పేరిట కలుసుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకుని ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలు గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు. వారికి జ్ఞాపికలు అందజేశారు.

దస్తురాబాద్ మండల కేంద్రంలో..

దస్తురాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996–1997 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివినవారంతా దస్తురాబాద్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు.



దస్తురాబాద్: మండల కేంద్రంలో 1996-97 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థులు

'బెస్ట్ అవైలబుల్' కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: 2025–26 విద్యాసంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజేశ్వర్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతిలో 49, ఐదో తరగతి లో 52 సీట్లున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ఎస్సీ విద్యార్థులు జూన్ 1నుంచి 16లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుటుంబంలో ఒకరికే ఈ స్కీం వర్తిస్తుందని, తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షల లోపు ఉండాలని పేర్కొన్నారు. ఒకటో తరగతిలో ప్రవేశానికి 01.06.2019 నుంచి 31.05 .2020 మధ్య జన్మించినవారు అర్హులని, జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అని తెలిపారు. ఐదోతరగతిలో చేరేవారు నాలుగో తరగతి ఉత్తీర్ణులైనట్లు రికార్డ్ షీట్ తీసుకురావాలని సూచించారు. రేషన్, ఆధార్‌కార్డులు, కులం, ఆదాయం సర్టిఫికెట్లతోపాటు ఒక పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫొటో, గతేడాది మార్కుల జాబితాను దరఖాస్తుకు జత చేయాలని తెలిపారు. నిర్మల్ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం నుంచి దరఖాస్తు ఫారాలు పొంది, పూర్తి చేసిన దరఖాస్తులను ఇదే కార్యాలయంలో జూన్ 16న సాయంత్రం 4గంటలలోపు అందించాలని సూచించారు. లాటరీ పద్ధతిలో జూన్ 20న సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. బాలికలకు 33శాతం, అనాథ పిల్లలకు 20, జోగిని పిల్లలకు 15, బాండెడ్ లేబర్ పిల్లలకు 15శాతం రిజర్వేషన్ కల్పించినట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారుల నుంచి ధ్రువపత్రాలు అందించినవారికే రిజర్వేషన్ వర్తిస్తుందని ఆయన వివరించారు.

ఆశల 'వికాసం'

- తొలుత రూ.లక్షలోపు వారికే..
- నేడు మంజూరుపత్రాల పంపిణీ

భైంసాటౌన్: యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పథకాన్ని ప్రవేశపెట్టింది. రూ.50వేల నుంచి రూ.4లక్షల వరకు వివిధ ఉపాధి యూనిట్లు నెలకొల్పేందుకు రుణాలు అందించాలని నిర్ణయించింది. గత మార్చి 17 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసింది. నేడు లబ్ధిదారులకు మంజూరుపత్రాలు అందించనుంది. కాగా, జిల్లా వ్యాప్తంగా 35,177 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో రూ.లక్షలోపు రుణాల కోసం తక్కువ సంఖ్యలో, రూ.2లక్షల నుంచి రూ.4లక్షలలోపు రుణాల కోసం అధికసంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తి చేసిన మండల, మున్సిపల్ స్థాయి కమిటీలు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించారు. జిల్లాస్థాయి కమిటీ లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆమోదంతో తుది జాబితా రూపొందించారు. మొదటగా రూ.50వేల నుంచి రూ.లక్షలోపు యూనిట్లకు ఎంపికైనవారికి మంజూరు పత్రాలు ఇవ్వనున్నారు. ఈనెల 10నుంచి 15వరకు లబ్ధిదారులకు శిక్షణ ఉంటుంది. ఆ తర్వాత లబ్ధిదారులు 16 నుంచి యూనిట్లు ప్రారంభించాలి. సిబిల్ స్కోర్ నిబంధన ఉండడంతో ఎవరికి రుణం మంజూరవుతుందోనని దరఖాస్తుదారుల్లో ఆందోళన నెలకొంది.

రూ.లక్షలోపువారికే పత్రాలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజీవ్ యువ వికాసం కింద తొలుత రూ.లక్షలోపు యూనిట్లకు దరఖాస్తు చేసుకున్నవారికి కార్పొరేషన్ల వారీగా మంజూరు పత్రాలు అందించనున్నాం. జిల్లాకు 11,066 యూనిట్లు మంజూరయ్యాయి. మిగతావారికి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విడతలవారీగా మంజూరు పత్రాలు అందజేస్తాం.

– రాంగోపాల్, లీడ్ బ్యాంక్ మేనేజర్, నిర్మల్

విడతలవారీగా ఇలా..

ఈ నెలలో రూ.లక్షలోపు రుణాలు, జూలైలో రూ.2లక్షల వరకు, ఆగస్టులో రూ.3లక్షలు, సెప్టెంబర్‌లో రూ.4లక్షల రుణాలకు దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులను ఎంపిక చేసి మంజూరు పత్రాలు విడతలవారీగా అందించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. రాజీవ్ యువ వికాసం రుణాల కోసం ఎస్సీ కార్పొరేషన్‌కు 2,894, ఎస్టీ కార్పొరేషన్‌కు 2,325, బీసీ కార్పొరేషన్‌కు 4,718, మైనార్టీ కార్పొరేషన్‌కు 1,072 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గౌరవ అతిథులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సోమవారం ఉదయం 9.55 గంటలకు సమీకృత కలెక్టరేట్ ఆవరణలోని అమరవీరుల స్మారక స్తూపం వద్ద తెలంగాణ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తారు. 10 గంటలకు ముఖ్య అతిథి రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. 10.05 గంటలకు పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తారు. 10.07 నుంచి 10.20 గంటల వరకు అతిథుల ప్రసంగం, 10.20 నుంచి 11గంటల వరకు వివిధ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, 11.15 తేనేటి విందు తదితర కార్యక్రమాలుంటాయి.



జిల్లా కేంద్రంలో సిద్ధమవుతున్న వేదిక

కొనుగోలు కేంద్రం పరిశీలన

సోన్: మండలంలోని పాక్‌పట్ల గ్రామంలోగల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని కోరారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యంపై ఆరా తీశారు. తప్ప, తేమ శాతం పేరుతో రైతులను మోసగిస్తే సహించే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. రైతులను దోపిడీ చేసే రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, సరికెల గంగన్న, మార గంగారెడ్డి, రమేశ్‌రెడ్డి, జక్క రాజేశ్వర్, నర్సారెడ్డి, ముత్యం, నర్సయ్య, గంగారెడ్డి, భీముడు, పోశెట్టి, రైతులున్నారు.



రైతులతో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


బోల్తాపడిన ఆటో

చింతలమానెపల్లి(సిర్పూర్): మండలంలోని అడెపల్లి గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. బాబాసాగర్ గ్రామం నుంచి ట్రాలీ వాహనం కాగజ్‌నగర్ వైపు వెళ్తుండగా, కాగజ్‌నగర్ నుంచి ముంజంపల్లి వైపు వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆటో బోల్తా పడగా, ట్రాలీ వాహనం రోడ్డు కిందకు పడిపోయింది. ఆటో డ్రైవర్ దుబ్బుల అంజన్న తలకు గాయాలు కాగా, ట్రాలీ డ్రైవర్ దీపక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అంజన్నను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఎస్సై ఇస్లావత్ నరేశ్ ఘటనా స్థలిని పరిశీలించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.

నిజాయతీ చాటుకున్న ఆర్టీసీ ఉద్యోగులు


బ్యాగు అందిస్తున్న రాజశేఖర్, రమణ, గులామ్

ఆదిలాబాద్: ఆర్టీసీ ఉద్యోగులు నిజాయతీ చాటుకున్నారు. ఆదిలాబాద్ నుంచి నిర్మల్‌కు వెళ్లే బస్సులో శనివారం ప్రయాణించిన అక్రమ్ బేగం అందులోనే తన బ్యాగు మర్చిపోయింది. గుర్తించిన కండక్టర్ వి.రమణ, డ్రైవర్ ఎం. గులాబ్ ఆ బ్యాగును డిపో అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్‌కు అప్పగించారు. వివరాలు తెలుసుకున్న డిపో అధికారులు సదరు మహిళకు ఆదివారం బ్యాగు అందించారు. అందులో 12 గ్రాముల బంగారం ఒక సెల్‌ఫోన్, రూ. వెయ్యి నగదు ఉన్నట్లు ప్రయాణికురాలు పేర్కొన్నారు. సిబ్బంది, యాజమాన్యానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

గాజులపేటలో చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాజులపేట్‌లో గల ఓ ఇంట్లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజుల్‌పేట్‌లో గల తన ఇంటికి అబ్దుల్ కదిరి తాళం వేసి సమీపంలోని సోదరి ఇంట్లోకి వెళ్లి నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటితాళం పగులగొట్టి రూ.7వేల నగదు ఎత్తుకెళ్లారు. ఉదయం ఇంటికి వచ్చిన అబ్దుల్ కదిరి పగలగొట్టిన తాళాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించాడు. సమీపంలోని పెట్రోల్ బంక్‌లో నిలిపి ఉన్న రెండు కొత్త వాహనాల బ్యాటరీలూ చోరీకి గురయ్యాయి.

యువకుడి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన 21ఏళ్ల కాంబ్లే సాయిప్రశాంత్ అదృశ్యమైనట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. తల్లిదండ్రులు చనిపోవడంతో మేనమామ ఇంట్లో ఉంటున్నాడు. శనివారం ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ప్రకృతి సోయగం..


చెట్టు కొమ్మల మధ్యన సూర్యుడి ప్రకాశం


గడ్డి తింటున్న చుక్కల దుప్పులు

ప్రకృతిలో ఎన్నో అందాలు దాగిఉన్నాయి. వాటిని చూసినప్పుడు మనసుకు ఎంతో హాయిగా ఉంటుంది. అలాంటి దృశ్యాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు అడవి, మైదానాలు పచ్చదనం సంతరించుకున్నాయి. జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలోని ఘనిషెట్టి కుంట సమీపంలో చుక్కల దుప్పులు ఇలా లేతగడ్డి తింటూ అటుగా వెళ్లేవారిని ఆకర్షిస్తున్నాయి. వీటిని రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ కెమెరాలో బంధించారు. ఇక జన్నారం మండల కేంద్రంలో వాగుపై వంతెన సమీపంలోని చెట్టు కొమ్మల చాటు నుంచి సాయం సంధ్యాసమయం భానుడు తొంగి చూస్తున్న దృశ్యం ప్రకృతి రమణీయతకు అద్దం పడుతోంది. – జన్నారం


పచ్చని మైదానంలో మెకాలు..

మత్తు వదలరా..!

- జిల్లాలో యథేచ్ఛగా గంజాయి విక్రయం, వినియోగం
- వాట్సాప్‌లో అమ్మకం, అడ్డాలు, సమయంపై సమాచారం
- నియంత్రణకు ట్రాకింగ్ డాగ్స్ వినియోగం


ఈ ఏడాది ఫిబ్రవరి 20న జిల్లా కేంద్రంలో గంజాయి ముఠా అరెస్టు చూపుతున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లాలో గంజాయి దందాపై పోలీసు యంత్రాంగం కఠిన చర్యలు చేపడుతున్నప్పటికీ, ఈ చీకటి వ్యాపారం తగ్గడం లేదు. గంజాయి మత్తులో యువత దాడులకు తెగబడటం, బెదిరింపులతో డబ్బులు లాక్కోవడం సమాజంలో ఆందోళన కలిగిస్తోంది. రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బాధ్యతలు చేపట్టిన తర్వాత, జిల్లాను గంజాయి రహితంగా మార్చడంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. అయినా క్షేత్రస్థాయిలో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. చిన్న ప్యాకెట్లలో గంజాయి రవాణా, విక్రయాలను గుర్తించడం పోలీసులకు పెద్ద సవాలుగా మారింది.

యువతే లక్ష్యంగా వ్యాపారం..

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులను గంజాయి స్మగ్లర్లు టార్గెట్ చేస్తున్నారు. ఉన్నత చదువులు చదివే యువత నుంచి రోడ్లపై తిరిగే యువకుల వరకు గంజాయికి బానిసలవుతున్నారు. గంజాయి సేవనంతో కలిగే ఆరోగ్య సమస్యలపై పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సామాజిక బాధ్యతగా, మత్తులో ఉన్న యువతను సన్మార్గంలోకి తీసుకొచ్చేందుకు వివిధ చర్యలు చేపడుతున్నారు.

సోషల్ మీడియా వేదిక..

సోషల్ మీడియా, ముఖ్యంగా వాట్సాప్ గంజాయి అమ్మకాలకు అడ్డాగా మారింది. గంజాయి సేవించే వారు వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసుకుని, కోడ్ భాషలో సమాచారం పంపుతూ అమ్మకాలు కొనసాగిస్తున్నారు. 100 గ్రాముల ప్యాకెట్లను రూ.200 నుంచి రూ.300కి విక్రయిస్తూ, రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య నిర్దిష్ట ప్రాంతాల్లో డెలివరీ చేస్తున్నారు. శ్రీరాంపూర్ రింగ్ రోడ్, రైల్వే స్టేషన్, కాలేజీ రోడ్, రాజీవ్ నగర్, ఎన్టీఆర్ నగర్, జాఫర్ నగర్, అండలమ్మ కాలనీ, తిలక్‌నగర్, బైపాస్ రోడ్ వంటి ప్రాంతాలు గంజాయి అమ్మకాలకు అడ్డాలుగా మారాయి. గతంలో గంజాయి వాడకం మాస్ ఏరియాలకు పరిమితమైనప్పటికీ, ఇప్పుడు క్లాస్ ఏరియాల్లోనూ జోరుగా సాగుతోంది.

సిగరెట్లలో గంజాయి..

పట్టణ కేంద్రాల్లోని పాన్ షాపులు, టీ స్టాల్స్ వద్ద గంజాయిని సిగరెట్లలో దాచి రహస్యంగా విక్రయిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని ఓ టీ స్టాల్ గంజాయి సిగరెట్ల విక్రయ కేంద్రంగా మారిందని ఆరోపణలు ఉన్నాయి. రోజూ వందల మంది యువత ఇక్కడికి వచ్చి, కోడ్ భాషలో గంజాయి సిగరెట్లను కొనుగోలు చేస్తున్నారు.

పెరుగుతున్న బానిసలు..

పోలీసు లెక్కల ప్రకారం, జిల్లాలో గంజాయి వాడకం గణనీయంగా పెరిగింది. గతంలో పట్టణ ప్రాంతాలకే పరిమితమైన గంజాయి వాడకం ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించింది. గంజాయి వ్యసనం యువతను సామాజిక, ఆరోగ్య సమస్యల వైపు నడిపిస్తోంది. పోలీసులు ఈ వ్యసనాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలతో పాటు, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికీ, గంజాయి దందా పూర్తిగా నియంత్రణలోకి రావడం లేదు.

ట్రాకింగ్ డాగ్స్‌తో తనిఖీలు

గంజాయి వాసన పసిగట్టే ట్రాకింగ్ డాగ్స్ సాయంతో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. పాత నేరస్తుల ఇళ్లు, పాన్ షాపుల్లో రాత్రిపగలు తేడా లేకుండా తనిఖీలు చేస్తున్నారు. అయినా, కచ్చితమైన సమాచారం లేనప్పుడు గంజాయి విక్రయాలను నియంత్రించడం కష్టంగా మారుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి మే 20 వరకు 30 కేసులు నమోదు కావడం, 95 మంది నిందితులను అరెస్ట్ చేయడం జిల్లాలో దందా ఏరీతిని సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. ఫిబ్రవరిలో సీసీ కెమెరాల వ్యాపారం ముసుగులో గంజాయి దందా నడిపిన 22 మంది ముఠాను పట్టుకుని, 23.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా, రూ.10.37 లక్షల విలువైన 34 కిలోల గంజాయిని ఈ ఏడాది స్వాధీనం చేసుకున్నారు.

రంగంలోకి ట్రాకింగ్ డాగ్స్..



గంజాయి విక్రయాలు, రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. పోలీస్ శాఖ గంజాయి నియంత్రణకు నార్కోటిక్ టీమ్‌లను ఏర్పాటు చేసింది. స్పెషల్‌గా గంజాయి నియంత్రణకు ప్రత్యేక శిక్షణ తీసుకున్న ట్రాకింగ్ డాగ్స్‌ను వినియోగిస్తున్నాం. జిల్లాకు అధికంగా మహారాష్ట్ర నుంచి వస్తుంది. సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా పోలీసులకు గంజాయి సమాచారం అందించి నియంత్రణకు కృషి చేయాలి. యువతను పెడదోవ పట్టకుండా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం.
– ఎగ్గడి భాస్కర్, డీసీపీ మంచిర్యాల

వర్షాకాలం.. పశువులు పైలం


డా.ఓంప్రకాశ్, పశువైద్యాధికారి


సతీశ్, పశువైద్యాధికారి, కత్తెరసాల


మేతకు వెళ్తున్న గొర్రెలు

చెన్నూర్‌రూరల్/లక్ష్మణచాంద: వర్షాకాలం ఆరంభమైంది. ఈసారి ముందస్తుగానే వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వ్యవసాయ పనులు కూడా మొదలయ్యాయి. మరోవైపు అకాల వర్షాలకు నేల కూడా పచ్చబడింది. లేదగడ్డి పశువులను ఆకర్షిస్తోంది. ఈ నేపథ్యంలో, పశువులకు అంటు వ్యాధులు త్వరగా సోకే అవకాశం ఉందని కత్తెరసాల, లక్ష్మణచాంద పశువైద్యాధికారి సతీశ్, ఓంప్రకాశ్ సూచించారు. పశుపోషకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. వర్షాకాలంలో గొర్రెలు, మేకలకు సంబంధించిన సాధారణ వ్యాధులు, వాటి లక్షణాలు, నివారణ, చికిత్స విధానాలు వెల్లడించారు.

గాలిపుండు (ఫుట్‌రాట్)

వ్యాధి లక్షణాలు: వర్షాకాలంలో చిత్తడి నేలలపై తిరిగే మేకలు, గొర్రెలకు గాలిపుండు వ్యాధి సోకే అవకాశం ఎక్కువ. ఈ బ్యాక్టీరియల్ వ్యాధి వల్ల గొర్రెలు కుంటుతూ, మూడు కాళ్లపై గెంటుతాయి. గిట్టల మధ్య ఎర్రగా కందిపోయి, చీము పట్టి నల్లగా మారుతుంది. తీవ్రమైతే గిట్టలు ఊడిపోయే ప్రమాదం ఉంది.

నివారణ చర్యలు

వ్యాధి సోకిన పశువులను వెంటనే గుర్తించి, ఆరోగ్యవంతమైన వాటికి దూరంగా ఉంచాలి.
చిత్తడి నేలలు, నీరు నిలిచే ప్రాంతాల నుంచి పశువులను దూరంగా ఉంచాలి. వర్షం నుంచి రక్షణ కల్పించే ఆరు ప్రాంతాల్లో పశువులను ఉంచాలి.
చికిత్స తర్వాత నయమైన పశువులను మాత్రమే ఆరోగ్యవంతమైన వాటితో కలపాలి.

చికిత్స విధానం

వైద్యుని సలహాతో పెన్సిలిన్, నొప్పి నివారణ మందులు వాడాలి. వ్యాధి సోకిన గిట్టలను 10% ఫార్మలిన్ లేదా కాపర్‌సల్ఫేట్ ద్రావణంలో ముంచాలి.

నీలి నాలుక వ్యాధి (బ్లూ టంగ్ డిసీజ్)

వ్యాధి లక్షణాలు: నీలి నాలుక వ్యాధి, వైరస్ వల్ల సంక్రమించే ఈ వ్యాధి దోమల ద్వారా వ్యాపిస్తుంది. వర్షాకాలంలో ఈవ్యాధి విస్తరణ అవకాశం ఎక్కువ.

లక్షణాలు: అధిక జ్వరం, దొంగ కారడం, పెదవులు, చిగుళ్లు వాచడం, ఎర్రటి గుల్లలు ఏర్పడడం. తీవ్ర సందర్భాల్లో గిట్టలు వాచి, నాలుక నీలం రంగులోకి మారుతుంది.
పశువులు నడవలేక, మేత మేయక, అచేతన స్థితికి చేరి కిందపడిపోతాయి.

నివారణ చర్యలు: ఈగలు, దోమల నివారణకు రోజుకు రెండుసార్లు వేప ఆకులతో పొగ వేయాలి. బురద, నీరు నిలిచే ప్రాంతాలను శుభ్రం చేయాలి.

చికిత్స విధానం

పశువైద్యుడిని సంప్రదించి, యాంటీబయోటిక్, నొప్పి నివారణ మందులు వాడాలి.
నోటి పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి, జింక్ పౌడర్ రాయాలి.
గిట్టల పుండ్లకు హిమాక్స్, లేమనెంట్ వంటి ఆయింట్‌మెంట్‌లు వాడాలి.

చిటుకు వ్యాధి..

తొలకరి గడ్డిలో క్లాస్ట్రీడియం ఫర్ ఫ్రింజర్స్ టైప్–డి అనే రకం సూక్ష్మజీవులు ఉంటాయి.ఈ సూక్ష్మ జీవులు గాలి లేని వాతావరణంలో ఎక్కువగా వృద్ధి చెందుతాయి. తొలకరి పిచ్చి గడ్డిని జీవాలు తిన్నప్పుడు జీవాల పేగుల్లో గాలి లేని వాతావరణం ఏర్పడి అక్కడ సూక్ష్మజీవుల వల్ల ఏర్పడిన విష పదార్థాల వల్ల ఈ చిటుకు వ్యాధి వస్తుంది.

వ్యాధి లక్షణాలు:

వ్యాధి సోకిన గొర్రెలు కొన్నిసార్లు ఎటువంటి లక్షణాలు లేకుండానే ఆకస్మికంగా మరణిస్తాయి. కొన్ని ఎగిరి కిందపడి కాళ్లు కిందకు కొట్టుకుంటూ, పళ్లు కొరుకుతూ చనిపోతాయి. వ్యాధి సోకిన గొర్రెలు దొంగ కారుస్తాయి. శ్వాస అధికంగా ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

చికిత్స కంటే నివారణ ముఖ్యం. మే నుంచి జూలై వరకు వ్యాధినిరోధక టీకా(మల్టీ కాంపోనెంట్ ఈటీ వ్యాక్సిన్) వేయించాలి. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలో పశు వైద్యాధికారికి తెలియ చేసి చికిత్స చేయించాలి. తొలకరి చినుకులకు మొలిచిన గడ్డి మేయకుండా చూసుకోవాలి. వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరు చేయాలి.

లెదర్ పార్క్ జేఏసీ ఏర్పాటు


జేఏసీ కమిటీ సభ్యులు

మందమర్రిరూరల్: లెదర్ పార్క్ సాధన సమితి ఆధ్వర్యంలో మందమర్రి, మంచిర్యాల లెదర్ ఇండస్ట్రియల్ పార్క్ జేఏసీ కమిటీలను మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో ఆదివారం ఎన్నుకున్నారు. మందమర్రి పట్టణ జేఏసీ కన్వీనర్‌గా నెరువెట్ల శ్రీనివాస్, కోకన్వీనర్‌గా మంతె సుమన్, ముల్కల్ల రమేశ్, రామకృష్ణ, నందిపేట రాజు, నెరువెట్ల సుజిత్, గడ్డం అనిల్, కొలుగూరి పృథ్వీరాజ్, బత్తుల సరిత, బొడ్డు వినోద, సకినాల సాయికృష్ణ, ఎంవీ.గుణ, కాసిపేట స్వామి, తోకల నిరోష, గౌరవాధ్యక్షులుగా ఉప్పులేటి నరేశ్ ఎన్నికయ్యారు. మంచిర్యాల జిల్లా గౌరవ అధక్షులుగా పుల్లూరి లక్ష్మణ్, కన్వీనర్‌గా చిప్పకుర్తి ఐలయ్య, కోకన్వీనర్లుగా జంగంపల్లి రామస్వామి, పల్లె సమ్మయ్య, నందిపేట రవి, దరిపెల్లి కనుకయ్య, సిర్ర దివాకర్, నేరెళ్ల శంకరయ్య, ఎలుకలపల్లి మల్లేశ్, సుద్దాల జనార్దన్, ఆసంపల్లి రాయమల్లు, బచ్చలి నరసయ్య, వేల్పుల కిరణ్, చిలుముల కుమార్, మామిడిపల్లి ప్రకాశ్, కొంకటి శ్రీనివాస్, కాసిపేట స్వామి ఎన్నికయ్యారు.

సత్యపాల్‌రావుకే ఐఎన్‌టీయూసీ మద్దతు

కాసిపేట: కాసిపేట మండలం దేవాపూర్ సిమెంట్ కంపెనీలో జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో సత్యపాల్‌రావుకే ఐఎన్‌టీయూసీ మద్దతు ప్రకటించింది. ఈమేరకు రాష్ట్ర కనీస వేతనాల బోర్డు చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ తెలిపారు. ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ మొదటి నుంచి ఐఎన్‌టీయూసీకి అనుబంధంగా ఉందని పేర్కొన్నారు. సత్యపాల్‌రావు తండ్రి రఘుపతిరావు ఐఎన్‌టీయూసీ మద్దతుతో ఇదే పలుమార్లు పోటీచేసి గెలిచారని గుర్తు చేశారు. ప్రస్తుతం కొందరు ఎమ్మెల్యేలు మద్దతు తెలుపుతున్న యూనియన్, అభ్యర్థికి ఐఎన్‌టీయూసీతో సంబంధం లేదని స్పష్టం చేశారు. ఐఎన్‌టీయూసీ కార్మికులకు అండగా ఉంటుందని తెలిపారు. సత్యపాల్‌రావును గెలిపించాలని కోరారు.

దేవాపూర్‌లో మోటర్ సైకిల్ ర్యాలీ

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో సత్యపాల్‌రావుకు మద్దతుగా నాయకులు, కార్మికులు మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీ గ్రామ పటేళ్లు, ఆదివాసీ సంఘాల నాయకులు, తెలంగాణ ఓరియంట్ స్టాఫ్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, ఓరియంట్ సిమెంట్ కంపెనీ కార్మిక నాయకులు రమణారెడ్డి మద్దతు తెలిపి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

శాస్త్రీయ పద్ధతిలో సర్దుబాటు చేయాలి

- టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల లచ్చిరాం

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సర్దుబాటును శాస్త్రీయ పద్ధతిలో చేయాలని టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల లచ్చిరాం డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 మంది విద్యార్థులకు ఇద్దరే ఎస్జీటీలను నియమించడం సరికాదన్నారు. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:20కి తగ్గించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఐదుగురు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలని పేర్కొన్నారు. బడిబాట సాగుతున్న సమయంలో సర్దుబాటు చేయడం సరికాదని తెలిపారు. ఇటీవల ఉద్యోగ విరమణతో చాలా పోస్టులు ఖాళీ అయ్యాయని తెలిపారు. విద్యా సంవత్సరానికి ముందే పదోన్నతులు కల్పిస్తే ప్రభుత్వ విద్య బలోపేతం అవుతుందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన భూపతిరెడ్డి, కిరణ్ బాల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలంధర్‌రెడ్డి, సంఘ బాధ్యులు ఆర్.సుజాత, గంద్రత్ నారాయణ, రామారావు, రమేశ్, దేవన్న, ఆదిలాబాద్ అర్బన్ ఎంఈవో సోమయ్య, శ్రీహరి, రమేష్, పండరీనాథ్, ప్రఫుల్‌చందర్, ఉపాధ్యాయులు యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆవుదూడను చంపిన కేసులో నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి


నిందితుడు ఉపయోగించిన కత్తి

ఆదిలాబాద్‌టౌన్: ఆవుదూడను చంపిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భోరజ్ మండలం సిర్సన్న గ్రామానికి చెందిన సాయికుమార్‌కు చెందిన ఆవుదూడను అదే గ్రామానికి చెందిన రాథోడ్ సంజయ్ గిమ్మ శివారులో కత్తితో పొడిచాడు. జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్సై గౌతమ్ అక్కడికి చేరుకోగా కొద్ది సేపటికే ఆవుదూడ మృతిచెందింది. పోలీసులు సంజయ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు వివరించారు. ఆవుదూడను చంపి అటవీ జంతువుల మాంసంగా అమ్మేందుకు ప్రయత్నం చేసినట్లు తెలిపారు. నిందితుడిపై గతంలో మేకల దొంగతనం, గుడిలో దొంగతనం, ఫారెస్ట్ కేసులు నమోదై ఉన్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా ఆవులను అక్రమంగా తరలించినా, చంపినా చట్టరీత్యా నేరమని అన్నారు. ఇలాంటి వారిపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఖానాపూర్: పట్టణంలోని ఖానాపూర్–తర్లపాడ్ వెళ్లే మార్గంలో మదీనా మసీద్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన షెట్టి హిమబిందు–చంద్రశేఖర్ దంపతులు తర్లపాడ్ గ్రామంలోని ఆలయానికి వెళ్లి ఖానాపూర్‌కు తిరిగి వస్తుండగా ఖానాపూర్ నుంచి తర్లపాడ్ వైపు వెళ్తున్న లారీ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హిమబిందు చేయి నుజ్జునుజ్జు కావడంతో పాటు చంద్రశేఖర్ తలకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108లో క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నిర్మల్‌కు రిఫర్ చేశారు. లారీ డ్రైవర్ అజాగ్రత్త, నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం చోటు చేసుకుందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉత్తమ 'సేవా' పతకాలు

- ఉమ్మడి జిల్లాలో పలువురు పోలీసులు ఎంపిక

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి పోలీసు శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరి రవి గుప్తా ఆదివారం పతకాలను ప్రకటించారు. తెలంగాణ శౌర్య పతకం కింద రూ.10వేల నగదు, తెలంగాణ మహోన్నత సేవా పతకం కింద రూ.40వేలు, తెలంగాణ ఉత్తమ సేవా పతకం కింద రూ.30వేలు, తెలంగాణ కఠిన సేవా పతకం కింద రూ.20వేలు, తెలంగాణ సేవా పతకం కింద రూ.20వేల నగదు అందజేసి సత్కరించనున్నారు. ఉమ్మడి జిల్లాలో పలువురు మహోన్నత, ఉత్తమ సేవా, సేవా పతకాలకు ఎంపికయ్యారు.

ఇంటెలిజెన్స్..

- ఎస్.లింగారెడ్డి, ఏఎస్సై, ఆదిలాబాద్ జోన్
- పి.శ్రీధర్, హెచ్‌సీ, ఆదిలాబాద్ జోన్

మహోన్నత సేవా పతకం : రామకృష్ణ, ఆర్ఐ, 2వ బెటాలియన్ యాపల్‌గూడ

ఉత్తమ సేవా పతకం : కె.నర్సయ్య, ఎస్సై, పీసీఆర్, ఆదిలాబాద్

ఎండీ తాహెర్‌ఖాన్, హెడ్‌కానిస్టేబుల్, సోన్, నిర్మల్

జిల్లాల వారీగా సేవా పతకాలకు ఎంపికైన వారు..

ఆదిలాబాద్..

- విష్ణుప్రకాశ్, ఎస్సై, టూటౌన్
- బి.రవీందర్ రెడ్డి, హెచ్‌సీ, గుడిహత్నూర్
- ఎ.నాగేశ్వర్, పీసీ, గాదిగూడ
- కె.కిషన్, ఏఆర్ పీసీ, ఆదిలాబాద్
- ఎ.రాములు, ఏఆర్ కానిస్టేబుల్, ఆదిలాబాద్
- సీహెచ్ గోపాల్, కానిస్టేబుల్, గాదిగూడ
- డి.రమేశ్, హెచ్‌సీ, టీజీఎస్‌పీ 2వ బెటాలియన్
- జి.నర్సయ్య, హెచ్‌సీ ఈజీఎస్‌పీ, 2వ బెటాలియన్

కుమురంభీం ఆసిఫాబాద్..

- రాజేందర్ ప్రసాద్, సీఐ, కాగజ్‌నగర్
- శ్రీనివాస్, ఎస్సై, ఆసిఫాబాద్
- తిరుమల, డబ్ల్యూ ఎస్సై, భరోసా సెంటర్, ఆసిఫాబాద్
- బాలాజీ, ఏఎస్సై, కాగజ్‌నగర్
- బీహెచ్ శ్రీనివాస్, ఏఆర్ హెడ్‌క్వార్టర్స్, ఆసిఫాబాద్
- ఎండీ అజీమొద్దీన్, హెచ్‌సీ, సిర్పూర్(టి)
- షేక్ ఇమామ్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, ఆదిలాబాద్
- విశ్వజీత్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, ఆసిఫాబాద్

నిర్మల్..

- ఎండీ సిద్దిఖీ హుస్సేన్, ఎస్సై, నిర్మల్
- ఎం. హనుమాండ్లు, ఏఎస్సై, నిర్మల్
- మారుతి, ఏఎస్సై, భైంసా రూరల్ పీఎస్
- అబ్దుల్ నయీమ్, ఏఆర్ ఎస్సై, దార్, నిర్మల్
- రాథోడ్ భీంరావు, ఏఎస్సై, దిలావర్‌పూర్
- రామారావు హెచ్‌సీ, డీఎస్బీ, నిర్మల్
- గంగారెడ్డి, హెచ్‌సీ, దిలావర్‌పూర్
- పెద్ద రాజన్న, హెచ్‌సీ, భైంసా
- చిన్నయ్య, హెచ్‌సీ, డీఎస్బీ, నిర్మల్
- డి.సుదర్శన్, పీసీ, తానూర్
- సూర్యవెంకటి, పీసీ, లక్ష్మణచాంద
- మాణిక్‌రావు, పీసీ, ముథోల్
- శివకుమార్, పీసీ, సోన్

మంచిర్యాల..

- డి.సురేందర్, ఏఆర్ ఎస్సై, గుడిపేట, మంచిర్యాల 13వ బెటాలియన్